సాక్షి ఆదిలాబాద్

ఆదివారం : 23 : జూన్ : 2024



'రుణమాఫీ'పై కాంగ్రెస్ హర్షం

రైతు రుణమాఫీ విషయంలో సీఎం ప్రకటనపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 9లో▸

మూడు దుకాణాల్లో పుస్తకాల విక్రయాలు

ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం జిల్లా కేంద్రంలో మూడు బుక్ సెల్లర్స్‌కు పుస్తకాలు విక్రయించేందుకు అనుమతి ఇచ్చినట్లు డీ ఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. విశ్వేశ్వర, పార్వతి, వినాయక బుక్‌స్టాళ్లలో పుస్తకాలు కొనుగోలు చేయవచ్చని సూచించారు.

గరిష్టం/కనిష్టం
30.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నైరుతి ప్రభావంతో పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోల్ క్లైంబింగ్ పరీక్ష



పోల్ క్లైంబింగ్ పరీక్షలో అభ్యర్థులు

ఆదిలాబాద్‌టౌన్: జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం) పోస్టుల భర్తీకోసం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పోల్ క్లైమ్మింగ్ పరీక్ష నిర్వహించారు. రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి జిల్లా కేంద్రంలోని ఆ శాఖ కార్యాలయంలో స్తంభాలు ఎక్కడం, దిగడం వంటి పరీక్షలు చేపట్టారు. ఎస్ఈ జేఆర్ చౌహాన్ పర్యవేక్షణలో ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేశారు. వీడియోగ్రఫీ ద్వారా పరీక్షలను రికార్డు చేశారు. ఎంపికైన వారికి ఉత్తర్వులు జారీ చేస్తామని ఎస్ఈ పేర్కొన్నారు.

టీచర్ల బదిలీ ప్రక్రియకు రంగం సిద్ధం

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియకు రంగం సిద్ధమవుతోంది. విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులు బదిలీలకు సంబంధించిన ఖాళీలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఆయా మండలాల అధికారులను పిలిచి వివరాలు అప్‌డేట్ చేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ నిలిచిపోయిన విషయం తెలిసిందే. తాజాగా ఆ ప్రక్రియ మళ్లీ ప్రారంభమైంది. ప్రొవిజినల్ సీనియారిటీ జాబితా తయారు చేసే పనిలో యంత్రాంగం నిమగ్నమయ్యారు. ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత వెబ్ ఆప్షన్లను మరో రెండు మూడు రోజుల్లో ఇవ్వనున్నారు. ఆ తర్వాత బదిలీలు చేపట్టనున్నారు. కొన్నేళ్లుగా ఒకేస్థానంలో ఉన్న ఉపాధ్యాయులకు స్థానచలనం కలగనుంది.

రైల్వే వంతెన పనులు పూర్తయ్యేలా చర్యలు



అండర్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌ఎం, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని రైల్వేఅండర్, ఓవర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని డివిజనల్ రైల్వే మేనేజర్ నీతి సర్కార్ అన్నారు. రైల్వేస్టేషన్‌తో పాటు రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి శనివారం ఆమె పరిశీలించారు. భద్రతా చర్యల విషయంలో అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలోనే రైల్వేఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల అసౌకర్యాన్ని దూరం చేసేలా ముందుకు సాగుతామన్నారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ పట్టణంలోని తాంసి బస్టాండ్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని కోరారు. నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ నిధులు రాకపోవడంతోనే పనుల్లో జాప్యం ఏర్పడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపితేనే పట్టణ వాసుల సమస్య తీరుతుందని డీఆర్‌ఎం దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జీవీ రమణ, రైల్వే అధికారులు, బీజేపీ నాయకులు ఉన్నారు.

ప్రశాంతంగా తైబజార్, స్లాటర్‌హౌస్ వేలం

- బల్దియాకు రూ.21.85 లక్షల ఆదాయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని తైబజార్, పశువుల వధశాల నిర్వహణకు సంబంధించి శనివారం వేలం ప్రక్రియ నిర్వహించారు. బల్దియాకు రూ.21.85 లక్షల ఆదాయం సమకూరింది. కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్ ఆధ్వర్యంలో తన చాంబర్‌లో ఈ ప్రక్రియ చేపట్టారు. తైబజార్‌ను రూ.20.69 లక్షలకు పాడి మీర్జా అమ్రీన్ బేగ్ దక్కించుకున్నారు. గతేడాదితో పోల్చితే ఈసారి రూ.5.9లక్షల ఆదాయం అదనంగా సమకూరింది. అలాగే పట్టణంలోని పశువధశాల కేంద్రం నిర్వహణను ఇష్తీకర్ అహ్మద్ రూ.1.16లక్షలకు దక్కించుకున్నారు. గతేడాదితో పోల్చితే ఈ సారి రూ.16,225 అదనపు ఆదాయం సమకూరింది.వీటిని దక్కించుకున్న వారు తొమ్మిది నెలల పాటు నిర్వహించుకునేలా కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో బల్దియా రెవెన్యూ అధికారి జాదవ్ కృష్ణ, ఆర్ఐ వెంకటేశ్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

అవిశ్వాస.. బేరం!

- కౌన్సిలర్లకు పెరిగిన డిమాండ్
- మద్దతు కోసం అధికార, విపక్షాల ఆరాటం
- బెట్టు చేస్తున్న మున్సిపల్ సభ్యులు
- రసవత్తరంగా 'వైస్ చైర్మన్' రాజకీయం

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ప్రస్తుతం పార్టీల వారీగా సభ్యుల బలాబలాలు	కౌన్సిల్‌లో మొత్తం సభ్యులు : 49	బీఆర్ఎస్: 24	కాంగ్రెస్: 13	బీజేపీ : 09	ఎంఐఎం : 03
అవిశ్వాసానికి అనుకూలంగా తీర్మానం చేసిన కౌన్సిలర్ల వివరాలు		బీఆర్ఎస్ :23		బీజేపీ : 08	కాంగ్రెస్: 02

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ బల్దియా రాజకీయం రసవత్తరంగా మారింది. మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్ రంజానీని పదవి నుంచి దింపాలని అధికార కాంగ్రెస్‌తో పాటు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల కౌన్సిలర్లు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే 33 మంది కౌన్సిలర్లు చేసిన సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మాన నోటీసును ఈనెల 19న జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు అందజేశారు. ఎలాగైనా అవి శ్వాసం నెగ్గాలని ఆయా కౌన్సిలర్లు యత్నిస్తున్నారు. ఇదే సమయంలో అవిశ్వాసం వీగిపోయేలా వైస్ చైర్మన్‌తో పాటు అధికార పార్టీ ముఖ్య నేతలు య త్నిస్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో కౌన్సిలర్లకు ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడింది. వారి మద్దతు కూడగట్టేందుకు ఇరు వర్గాలు య త్నిస్తుండటంతో బల్దియా రాజకీయం హీటెక్కింది.

సరిపడా మద్దతు ఉన్నా... ఆందోళనే

వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గాలంటే సమావేశం రోజున 2/3 వంతు సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. ఈ లెక్కన 33 మంది సభ్యుల మద్దతు అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అంతే మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి అవిశ్వాస నోటీసు అందజేశారు. దీంతో అవసరమైన మద్దతు వారికున్నట్లే. అయినప్పటికీ సదరు కౌన్సిలర్లలో ఆందోళన వ్యక్తమవుతుంది. ఎందుకంటే అవిశ్వాసం నోటీసు అందించే రోజునే ఇద్దరు బీఆర్ఎస్ సీనియర్ కౌన్సిలర్లు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం. దీంతో మరో కౌన్సిలర్ చేజారిపోకుండా తీర్మానం ప్రతి అందజేసిన వర్గం పట్టు బిగిస్తోంది. అవిశ్వాసం నెగ్గేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చిస్తున్నారు. తమ వర్గం వారికి నచ్చజెప్పే యత్నం చేస్తున్నారు. అయితే సదరు కౌన్సిలర్లకు భరోసా ఇస్తున్నప్పటికీ ఒకవేళ జంప్ అయితే తమ ప్రయత్నం వృథా అవుతుందనే ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది. ఇంకా అవిశ్వాస సమావేశానికి తేదీ ఖరారు కానప్పటికీ కౌన్సిలర్లను కాపాడుకోవడం అవిశ్వాస నోటీసు అందజేసిన వర్గానికి పెద్ద పరీక్షగా మారింది. అయితే ఈ వ్యవహారాన్ని వెనుకుండి నడిపిస్తున్న ఓ మాజీ ప్రజాప్రతినిధి కౌన్సిలర్లు చేజారిపోకుండా చూస్తున్నట్లుగా తెలుస్తోంది.

అధికార పార్టీ గురి

ఈ అవిశ్వాస తీర్మానఅంశాన్ని అధికార పార్టీ నాయకులు సవాలుగా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎలాగైనా వీగిపోయేలా చేసిరాజకీయంగా పైచేయి సాధించాలని హస్తం పార్టీకి చెందిన ఓ ముఖ్య నాయకుడు భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. నోటీసు అందజేసిన కౌన్సిలర్లపై గురిపెట్టినట్లుగా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లనే తమ పార్టీలోకి లాగడం ద్వారా ఆ పార్టీ పట్టుకోల్పోయిందని చాటేలా పలువురు సభ్యులకు గాలం వేసినట్లుగా సమాచారం. ఇప్పటికే పలువురిపై అధికార కాంగ్రెస్ పార్టీ గురి పెట్టగా ఆ పార్టీ ప్రధాన నాయకుడి సూచనల మేరకు ద్వితీయ స్థాయి నాయకులు వారితో మంతనాలు జరుపుతున్నారు. అధికార పార్టీలోకి చేరడం ద్వారా వారికి కలిగే ప్రయోజనాలను వివరిస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీలోకి వస్తే ఆర్థికంగానే కాకుండా పెద్ద ఎత్తున పనులు కేటాయిస్తామని, వచ్చే ఎన్నికల్లోనూ పార్టీ తరఫున టికెట్ కేటాయిస్తామని ఆఫర్ ఇస్తున్నారు. ఆర్థికంగా వీక్‌గా ఉన్న కౌన్సిలర్లపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. వారికి అన్ని విధాలా అండదండగా ఉంటామని నచ్చజెపుతున్నారు. సమావేశం తేదీ నాటికి కనీసం ఓ ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లను పార్టీలోకి చేర్చుకుని తన సత్తా ఏంటో చాటాలని సదరు నాయకుడు భావిస్తున్నట్లుగా ఆ పార్టీలో చర్చ సాగుతోంది. ఈ బాధ్యతలను ముగ్గురు కీలకనాయకులకు అప్పగించినట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే సదరు నాయకులు ఒకరిద్దరు సీనియర్ కౌన్సిలర్లతో పాటు కొత్తగా ఎన్నికైన వారితోనూ మంతనాలు సాగించినట్లుగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో సదరు కౌన్సిలర్లు సైతం షరతులు పెడుతున్నట్లుగా సమాచారం. అధికార పార్టీ ఆఫర్ చేసిన దానికంటే అధికంగా డిమాండ్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అడిగినంత ఇస్తే పార్టీలో చేరేందుకు తాము సిద్ధమని ఒకరిద్దరు సభ్యులు అధికార పార్టీ నాయకులకు భరోసా ఇచ్చినట్లుగా చర్చ సాగుతుంది. ఇలా కౌన్సిలర్లను ఆకర్షించేందుకు అధికార పార్టీ ప్రయత్నం చేస్తుండగా.. వారిని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ చేస్తున్న వ్యూహాలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

అందరూ ఇన్‌చార్జీలే!

- జిల్లాలో రెగ్యులర్ ఎంఈవోలు కరువు
- 18 మండలాలు.. ఎనిమిది మంది సీనియర్ హెచ్‌ఎంలకు బాధ్యతలు
- ఒక్కొక్కరికి రెండు నుంచి మూడేసి చొప్పున..
- కొరవడుతున్న పర్యవేక్షణ
- విద్యావ్యవస్థపై ప్రభావం



ఆదిలాబాద్ ఎంఈవో కార్యాలయం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో రెగ్యులర్ ఎంఈవోలు కరువయ్యారు. మండల పరిధిలో ఆయా పాఠశాలలను పర్యవేక్షించాల్సిన అధికారులు అంతా ఇన్‌చార్జీలే ఉండడంతో విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. 18 మండలాలకు ఒక్కరు కూడా రెగ్యులర్ మండల విద్యాధికారి లేరు. సీనియర్ ప్రధానోపాధ్యాయులే ఎంఈవోలుగా వ్యవహరిస్తున్నారు. ఒక్కొక్కరు రెండు నుంచి మూడు మండలాల చొప్పున ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇటు పాఠశాలకు అటు అదనపు బాధ్యత నిర్వహిస్తున్న మండలాలకు సైతం న్యాయం చేయలేకపోతున్నారు. ప్రభుత్వం సర్కారు బడుల బలోపేతం కోసం చర్యలు చేపడుతున్నప్పటికీ రెగ్యులర్ ఎంఈవోలను నియమించక పోవడంతో విద్యా వ్యవస్థ గాడి తప్పుతోంది. మౌలిక వసతుల కల్పన కోసం చర్యలు చేపడుతున్నప్పటికి ఏళ్లుగా ఎంఈవో పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి సైతం ఇన్‌చార్జే కావడం గమనార్హం.

రెగ్యులర్ ఒక్కరూ లేరు..

జిల్లాలో 18 మండలాలు ఉన్నాయి. అన్నిచోట్ల ఇన్‌చార్జి ఎంఈవోలే ఉన్నారు. ఆదిలాబాద్‌అర్బన్, రూరల్, మావల మండలానికి ఒకరు ఉండగా, జైనథ్, బేల, ఉట్నూర్ మండలాలకు ఒక ఎంఈవో, బజార్‌హత్నూర్, భీంపూర్, తాంసికి ఒకరు, ఇంద్రవెల్లి, తలమడుగుకు ఒక ఎంఈవో, బోథ్, నేరడిగొండకు ఒకరు, నార్నూర్, గాదిగూడకు ఒక ఎంఈవో ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. ఇచ్చోడ, సిరికొండకు ఒకరు ఇన్‌చార్జీగా ఉండగా, గుడిహత్నూర్ మండలానికి మాత్రమే ఒక ఎంఈవో ఉన్నారు. దీంతో ఇన్‌చార్జీలు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేక పోతున్నారు. వీరు అదనపు భారంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పర్యవేక్షణ, బడిబాట, మధ్యాహ్నభోజనం పర్యవేక్షణ, పాఠ్య పుస్తకాల పంపిణీ, పాఠశాలల పరిశీలన పూర్తిస్థాయిలో చేయలేక పోతున్నారు. ఇందులో కొంత మంది ఎంఈవోలు ఏదో ఒక మండలంలో కార్యాలయానికే పరిమితం అవుతున్నారు. కొంత మంది డుమ్మా ఉపాధ్యాయులకు ఇది వరంగా మారింది. అయితే ఇచ్చోడ, సిరికొండ ఇన్‌చార్జి ఎంఈవోగా ఉన్న ప్రధానోపాధ్యాయుడు గుడిహత్నూర్ మండలంలోని సీతగొందిలో పనిచేస్తున్నాడు. నార్నూర్, గాదిగూడ మండలాల ఎంఈవో ఉట్నూర్‌లో ప్రధానోపాధ్యాయుడిగా వ్యవహరిస్తున్నారు. గుడిహత్నూర్ ఎంఈవో మావల మండలంలోని వాగాపూర్‌లో ప్రధానోపాధ్యాయుడిగా ఉన్నారు. ఆ మండలాల్లో పనిచేయని వారు సైతం ఇన్‌చార్జీలుగా వ్యవహరించడం గమనార్హం. కొందరికి ఆయా నియోజకవర్గాల్లోని మండలాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇదిలా ఉంటే వారు రెగ్యులర్‌గా పనిచేసే పాఠశాలలకు అప్పుడప్పుడు వెళ్లడంతో ఈ ప్రభావం పదో తరగతి ఫలితాలపై కనిపిస్తోంది.

చదువులపై ప్రభావం..

రెగ్యులర్ మండల విద్యాధికారులు లేకపోవడంతో సర్కారు బడుల్లో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతోంది. ఎంఈవోలు ప్రతిరోజు మూడు పాఠశాలలను సందర్శించాల్సి ఉండగా, ఒక్కొక్కరికి రెండు మూడు మండలాల అదనపు బాధ్యతలు ఉండడంతో ఎక్కడా పర్యవేక్షణ పూర్తిస్థాయిలో చేయడం లేదు. కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాలలకు డుమ్మా కొడుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే కొంత మంది వంతుల వారీగా సైతం విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సమయపాలన పాటించకపోవడం, వారికినచ్చినప్పుడే రావడం, పాఠశాల సమయం ముగియకముందే ఇంటి బాట పడుతున్నారు.

రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలి



ప్రభుత్వం రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలి. రాష్ట్ర వ్యాప్తంగా 542 మందికి గాను 16 మందే రెగ్యులర్ మండల విద్యాధికారులు ఉన్నారు. ఇన్‌చార్జి ఎంఈవోలకు పని ఒత్తిడి పెరిగి ప్రధానోపాధ్యాయులపై అదనపు భారం పడుతోంది. పర్యవేక్షణ కొరవడుతోంది. ఇది విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతుంది.

– వృకోదర్, డీటీఎఫ్ జిల్లాప్రధానకార్యదర్శి

ఉన్నవారికే అదనపు బాధ్యతలు

జిల్లాలో 18 మండలాలకు గాను 8 మంది ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జి ఎంఈవోలుగా పనిచేస్తున్నారు. కోర్టు కేసు కారణంగా ఉన్నవారికే అదనపు బాధ్యతలు అప్పగించాం. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పనిభారం పెరుగుతున్నప్పటికీ విద్యార్థుల చదువులకు ఆటంకంలేకుండా చర్యలు చేపడుతున్నాం.

– ప్రణీత, డీఈవో

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- 'మహిళా శక్తి' ప్రణాళిక రూపొందించాలి
- పలు శాఖల అధికారులతో కలెక్టర్ రాజర్షి షా సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం తలపెట్టిన మహిళా శక్తి కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులు, మహిళా శక్తి కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా ఉన్నతి–తెలంగాణ ప్రగతి లక్ష్యంతో రానున్న ఐదేళ్లలో మహిళలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మహిళా శక్తి ద్వారా 15రకాల కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు యూనిఫాం కుట్టుపనిని వారికే అప్పగించిందన్నారు. మహిళా శక్తి కింద మైక్రో ఎంట్రాప్రెన్యూర్స్, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, పౌల్ట్రీ మదర్ యూనిట్స్, సంచార మత్స్య విక్రయ ఔట్ లెట్లు, మిల్క్ పార్లర్స్, మీసేవ, ఈవెంట్ మేనేజ్మెంట్, మహిళా క్యాంటీన్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, కస్టం హైరింగ్ కేంద్రాలు వంటి కార్యకలాపాలు చేపట్టనుందన్నారు. ఇందుకోసం మండలాల వారీగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ యూనిట్లు నెలకొల్పేలా ఇప్పటి నుంచే శ్రీకారం చుట్టాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో జరిగే శిక్షణ తరగతులకు ఔత్సాహికులైన సభ్యులను ఎంపిక చేయాలని సూచించారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపడుతున్న పనులను ఈ నెల 30లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీవో సాయన్న, ట్రాన్స్‌కో ఎస్ఈ జేఆర్ చౌహాన్, ఈడీఎం రవి, డీపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

ఎదులాపురం: ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్ చౌహాన్, వలబోజు గోపీకృష్ణ కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షిషాను శనివారం కలిసి వినతి పత్రం అందించారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

కైలాస్‌నగర్: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ పరీక్షలను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలు ఈ నెల 24 నుంచి 29 వరకు, అలాగే డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ పరీక్ష ఈ నెల 30నుంచి జూలై 4వ తేదీ వరకు షిఫ్ట్‌ల వారీగా ఆన్‌లైన్ పద్ధతిన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని వెల్లడించారు. మావల మండల కేంద్రంలోని నలంద డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సెంటర్ వద్ద గట్టి బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్ సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. సమవేశంలో కలెక్టరేట్ ఏవో అరవింద్ కుమార్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఎస్‌వో కిరణ్ కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ గుట్కా లొల్లి

- ఆదిలాబాద్ పట్టణం కుమార్‌పేట్ సమీపంలోని ఓ జిన్నింగ్ గోదాంను మహ్మద్ జిషాన్ అనే వ్యక్తి అద్దెకు తీసుకున్నాడు. అందులో నిషేధిత గుట్కాను నిల్వ ఉంచాడు. పక్కా సమాచారం మేరకు పోలీసులు ఈ నెల 14న గోదాంపై దాడులు నిర్వహించి రూ.4లక్షల 20 వేల 540 విలువ గల గుట్కా స్వాధీనం చేసుకున్నారు.
- నిషేధిత గుట్కాను నిర్మల్ నుంచి నేరడిగొండకు తీసుకువచ్చి విక్రయిస్తున్న అత్తర్ అహ్మద్ ఫారూఖిని పోలీసులు ఈనెల 20న అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.6,260 విలువగల గుట్కా స్వాధీనం చేసుకున్నారు.



గోదాంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)



ఇటీవల మావల పోలీసుస్టేషన్ పరిధిలో పట్టుకున్న నిషేధిత గుట్కా (ఫైల్)

- పొగాకు ఉత్పత్తులపై సర్కారు నిషేధం
- గతంలో హైకోర్టు తీర్పుతో బ్యాన్ నిలుపుదల
- తాజాగా తిరిగి అక్రమ నిల్వపై వ్యాపారుల దృష్టి
- దాడులు విస్తృతం చేసిన పోలీసులు

సాక్షి,ఆదిలాబాద్: గుట్కా లొల్లి మళ్లీ మొదలైంది. సాధారణంగా వీటిపై నిషేధం ఉన్నప్పుడు మార్కెట్లో విక్రయాలు అక్రమంగా కొనసాగుతాయి. ఈ క్రమంలో వ్యాపారులు ధర భారీగా పెంచుతారు. దీనికి అలవాటు పడ్డవారి జేబుకు చిల్లు పడుతుంది. పొగాకు, నికోటిన్ కలిసి ఉన్న గుట్కా, పాన్‌మసాలాపై రాష్ట్రప్రభుత్వం నిషేధం విధించింది. ప్రధానంగా గుట్కా ప్యాకెట్లు, పొగాకు, నికోటిన్ ప్యాకెట్లు వేర్వేరుగా తయారు చేసి ఆయా కంపెనీలు మార్కెట్లోకి తెలివిగా విడుదల చేస్తాయి. ఈ రెండు ప్యాకెట్లు కలిపినప్పుడే నిషేధ జాబితాలోకి వస్తుంది. ఇలా చట్టంలోని లొసుగుల ఆధారంగా ఈ అక్రమ వ్యాపారాన్ని కొంత మంది తమకు అనుకూలంగా మార్చుకొని భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

తాజా ఉత్తర్వుల నేపథ్యంలో..

రాష్ట్ర ఆహార భద్రత అధికారులు ఇటీవల కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో గుట్కా, పాన్‌మసాలపై మరో ఏడాది నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించారు. మే 24, 2024 నుంచి ఏడాది పాటు ఈ నిషేధం అమలులోకి తీసుకొచ్చారు. గుట్కా, పాన్ మసాల తయారీ, అమ్మకం, సరఫరా స్టోరేజీ, పంపిణీపై ఈ నిషేధం ఉంది. పొగాకు, నికోటిన్ ఆరోగ్యానికి అత్యంత హానికరమని ఆరోగ్య భద్రత విభాగాలు స్పష్టం చేస్తున్నాయి. వీటి వినియోగంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తున్నాయని చెబుతున్నారు. నోటి క్యాన్సర్, ఫైబ్రోసిస్ వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. గుట్కా, పాన్‌మసాల బ్యాన్‌పై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతున్నప్పటికీ శాశ్వతంగా నిషేధం విధించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

అంతకుముందు హైకోర్టు రద్దు తీర్పు నేపథ్యంలో..

రాష్ట్రంలో గుట్కా, పాన్‌మసాల వంటి పొగాకు ఉత్పత్తులను నిషేధిస్తూ ఆహార భద్రత కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ అవుతుంటాయి. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ఏటా విడుదలవుతుంటాయి. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన సంస్థలపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. అయితే 2023 జనవరిలో ఈ పొగాకు ఉత్పత్తులపై నిషేధం విధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ఆ తర్వాత నిషేధం లేకపోవడంతో ఇది మార్కెట్లో విరివిగా లభ్యమవుతూ వచ్చాయి. తాజాగా ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ తీసుకురావడం, దాని ఆధారంగా చర్యలు చేపడుతోంది. దీంతో అప్పట్లో హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ నోటిఫికేషన్‌కు వర్తించదు. దీంతోనే పోలీసులు విస్తృతంగా దాడులు చేస్తూ వస్తున్నారు.

సమాచారం అందించాలి

నిషేధిత పొగాకు ఉత్పత్తులను ఎవరైనా నిల్వ చేసినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. పొగాకు, నికోటిన్ కలిసి ఉన్న గుట్కా పాన్ మసాలాలను ప్రభుత్వం నిషేధించింది. ఈ మేరకే మా ఫోర్స్ ఇటీవల దాడులు చేసి కేసులు నమోదు చేస్తుంది. 20కి పైగా కేసులు నమోదు అయ్యాయి.

– గౌస్ ఆలం, ఎస్పీ

ఇదీ పరిస్థితి..

జిల్లా కేంద్రంలో ఇద్దరు ప్రధాన నిషేధిత గుట్కా అక్రమ వ్యాపారం నిర్వహణలో ఆరి తేరారు. వీరిపై ఎన్నో కేసులు నమోదై ఉన్నాయి. ఈ నేపథ్యంలో గతంలో పోలీసు అధికారులు ఈ అక్రమ వ్యాపారాన్ని కూకటి వేళ్లతో తుద ముట్టిస్తామని చెప్పడం వారిపై పీడీ యాక్ట్, నాన్‌బెయిలెబుల్ కేసులు నమోదు చేస్తామని వార్నింగ్ కూడా ఇచ్చారు. అయినప్పటికీ ఈ అక్రమ దందా ఆగింది లేదు. కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి సరుకును పెద్ద వాహనాల్లో రాష్ట్రానికి తీసుకువస్తున్నారు. ఆదిలాబాద్‌కు చెందిన వ్యాపారులే రాష్ట్రంలో పలు చోట్ల ఈ నిషేధిత గుట్కాను సరఫరా చేయడంలో ఆరి తేరి ఉన్నారు. ఒకేసారి నాలుగైదు వాహనాలు ఈ సరుకుతో రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి. వేర్వేరు దారుల్లో వచ్చే క్రమంలో ఎక్కడైనా ఒక వాహనం పట్టుబడిన పక్షంలో మిగతా వాహనాల్లోని సరుకు విలువను రెట్టింపు చేసి అమ్మడం ద్వారా నష్టాన్ని పరోక్షంగా పూడ్చుకుంటారని ఈ దందా విషయం తెలిసిన పలువురు పేర్కొంటారు. ఆ తర్వాత చట్టంలోని లొసుగులను ఆధారంగా చేసుకొని వాహనం, సరుకును బయటకు తీసుకురావడం ద్వారా నష్టపోకుండా ఉంటారనే ప్రచారం పోలీసు శాఖలోనే ఉంది.

క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్‌: 2024–25 విద్యా సంవత్సరంలో సివిల్‌ సర్వీసెస్‌ పరీక్షలకు సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీఈ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల తెలంగాణ స్టడీ సర్కిల్‌లో సివిల్స్‌ ప్రిలిమినరీ, మెయిన్స్‌ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునిత కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 22 నుంచి జూలై 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూలై 21న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు 10 నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు భోజన, వసతిసౌకర్యం కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9494149416 నంబరులో సంప్రదించాలని సూచించారు.

24న ఐటీడీఏ ఎదుట ధర్నా

ఆదిలాబాద్‌రూరల్‌: ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ ఈ నెల 24న ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కమిటీ కార్యనిర్వహణ అధ్యక్షుడు గోడం గణేశ్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్‌ ప్రాంతంలో మెగా స్పెషల్‌ డీఎస్సీ ఏర్పాటు చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఐటీడీఏలో బ్యాక్‌లాక్‌ పోస్టులు భర్తీ చేయాలని, జీవో 3ను యథావిధిగా కొనసాగించాలని, పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని, ఏజెన్సీ ప్రాంతంలో జీవో 317 రద్దు చేయాలని, తదితర డిమాండ్లతో ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 9 తెగల ఆదివాసీ నాయకులు, ప్రజలు, ఉద్యోగులు, సంఘాల నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధిగా అజయ్‌



అజయ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా జిల్లా కేంద్రానికి చెందిన తోట అజయ్‌ కుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌, ప్రధాన కార్యదర్శి క్రాంతికిరణ్‌ ఉత్తర్వులు జారీ చేసినట్లు అజయ్‌ తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ, ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపాడు.

బంగారు గొలుసు అపహరణ

తాంసి: పంటచేనులో పత్తి విత్తనాలు వేస్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటన శనివారం మండలంలోని హస్నాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రాజవ్వ శనివారం మధ్యాహ్నం ఒంటరిగా పత్తిచేనులో విత్తనాలు వేస్తుండగా అంతర్రాష్ట్ర రహదారి గుండా ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తుల్లోంచి ఒకరు ఆమె వద్దకు వెళ్లి మాటల్లోకి దించాడు. మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కుని మిగతా ఇద్దరితో కలిసి బైక్‌పై పరారయ్యాడు. గొలుసు విలువ రూ.70వేలు ఉంటుందని బాధిత మహిళ వాపోయింది. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై శివరాం గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. సుంకిడి వద్ద సీసీకెమెరాలు పరిశీలించగా నంబర్‌ప్లేట్‌ లేని బైక్‌పై దుండగులు మహారాష్ట్రవైపు వెళ్లినట్లు గుర్తించారు. డీఎస్పీ జీవన్‌ రెడ్డి, రూరల్‌ సీఐ ఫణీందర్‌ సైతం బోరీపై ఆరా తీశారు. మహారాష్ట్ర వైపు ఉన్న గ్రామాల సీసీ కెమెరాలను సైతం పరిశీలించాలని ఆదేశించారు.

ట్రైనీ ఐఏఎస్‌ల 'తెలంగాణ దర్శన్‌'



కడెం హరిత రిసార్ట్‌ వద్ద శిక్షణ ఐఏఎస్‌లు

- కడెం ప్రాజెక్టు సందర్శన

కడెం: తెలంగాణ దర్శన్‌లో భాగంగా 2023 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ ఐఏఎస్‌లు రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలు, పర్యాటక ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ఏడుగురితో కూడిన బృందం వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్కడి స్థితిగతులను తెలుసుకుంటున్నారు. శుక్రవారం రాత్రి కడెం హరిత రిసార్ట్‌లో విడిది చేసిన ట్రైనీ ఐఏఎస్‌లు శనివారం కడెం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ప్రాజెక్టు స్థితిగతులు తెలుసుకున్నారు. ఉత్తరాఖండ్‌లో శిక్షణ పొందిన వీరు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు అసిస్టెంట్‌ కలెక్టర్లుగా నియమించబడ్డారని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం నోడల్‌ అధికారి డాక్టర్‌ పి.శ్రీనివాస్‌ తెలిపారు. ఐఏఎస్‌ల బృందంలో సంకేత్‌, ఉమాహారతి, మనోజ్‌ తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు కాగా, అజయ్‌ ఉత్తర్‌ప్రదేశ్‌, గరిమా ఉత్తరాఖండ్‌, మృణాన్‌శ్రేష్ఠ, అభిజ్ఞాన్‌ బిహార్‌ రాష్ట్రానికి చెందినవారు.

ఆర్జీయూకేటీ సందర్శన



ఆర్జీయూకేటీలో ఐఏఎస్‌ ట్రైనింగ్‌ బృందం

బాసర: తెలంగాణ దర్శన్‌లో భాగంగా 2023 బ్యాచ్‌ ట్రైనీ ఐఏఎస్‌లు ఆర్జీయూకేటీని శనివారం సందర్శించారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్‌ వెంకటరమణ సూచన మేరకు స్పెషల్‌ ఆఫీసర్‌ సృజన, అసోసియేట్‌ డీన్‌ యువ ఐఏఎస్‌లను ఆహ్వానించారు. క్యాంపస్‌లోని కాన్ఫరెన్స్‌ హాల్‌లో అకడమిక్‌, అడ్మినిస్ట్రేషన్‌ అధికారులతో సమావేశమయ్యారు. విద్యార్థుల సంఖ్య, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, కోర్సుల వివరాలు, వసతి గృహాల స్థితిగతులు, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో విద్యార్థుల నైపుణ్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఐఏఎస్‌ కావాలనే సంకల్పం కలిగిన విద్యార్థులు యువ ఐఏఎస్‌లను అడిగి సందేహాలు నివృత్తి చేసుకున్నారు. యువ ఐఏఎస్‌ల వెంట నోడల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌ ఉన్నారు. కార్యక్రమంలో అసోసియేట్‌ డీన్స్‌ డాక్టర్‌ పావని, మహేశ్‌, సెక్యూరిటీ ఆఫీసర్‌ రాకేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రీ, ఫార్మా రంగం అభివృద్ధి



మాది ఉత్తర్‌ప్రదేశ్‌ రాష్ట్రం ఆగ్రా, నేను ఐఐటీ ఢిల్లీలో పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్‌ అయ్యాను. తెలంగాణ రాష్ట్రంలో ఇండ్రస్ట్రీ, ఫార్మారంగం బాగా అభివృద్ధి చెందాయి, నన్ను బాగా ఆకర్షించాయి. నేను కరీంనగర్‌ అసిస్టెంట్‌ కలెక్టర్‌గా పనిచేస్తున్నాను. తెలంగాణ ప్రజలు సహృదయులు. యూపీఎస్సీ ఆశావహులు లక్ష్యంతో, ప్రణాళికాబద్ధంగా చదివితే ఐఏఎస్‌ సాధించవచ్చు.

– అజయ్‌, అసిస్టెంట్‌ కలెక్టర్‌, కరీంనగర్‌

టూరిస్ట్‌ సర్క్యూట్‌ ఏర్పాటు చేయాలి



మాది మంచిర్యాల జిల్లా దండేపల్లి. సివిల్స్‌లో 35 ర్యాంక్‌ సాధించి ఐఏఎస్‌గా ఎంపికయ్యాను. మా నాన్న ఆదిలాబాద్‌ ఉద్యాన శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. సొంత రాష్ట్రంలోనే ఉద్యోగం చేయడం ఆనందంగా ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా ప్రకృతి అందాలకు నెలవు, కాళేశ్వరం, కడెం, నిర్మల్‌, బాసర తదితర ప్రాంతాలను కలిపి టూరిస్ట్‌ సర్క్యూట్‌ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– సంకేత్‌, అసిస్టెంట్‌ కలెక్టర్‌, నిజామాబాద్‌

డెడ్‌ స్టోరేజీలోనే 'సాత్నాల'



నీళ్లు లేక వెలవెలబోతున్న సాత్నాల ప్రాజెక్ట్‌

జైనథ్‌: వానాకాలం సీజన్‌ ప్రారంభమై 15 రోజులు దాటినప్పటికీ మండలంలో చెప్పుకోదగ్గ వర్షాలు కురియకపోవడంతో సాత్నాల ప్రాజెక్ట్‌ ఇంకా డెడ్‌ స్టోరేజీలోనే ఉంది. ఈ ఏడాది వేసవిలో ఎండలు దంచికొట్టడంతో ప్రాజెక్టులో నీళ్లు అడుగంటాయి. 1.54 టీఎంసీల సామర్థ్యం, 286.5 మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్‌ గల ప్రాజెక్టు వేసవిలో 0.160 టీఎంసీ సామర్థ్యం, 279.40 ఎఫ్‌ఆర్‌ఎల్‌కు పడిపోవడంతో డెడ్‌ స్టోరేజీకి చేరుకున్నట్లు అధికారులు ప్రకటించారు. అయితే అప్పటి నుంచి ప్రాజెక్ట్‌లోకి చుక్కా నీరు రాకపోవడంతో వేసవి కాలం పరిస్థితులే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒకవైపు వానాకాలం సీజన్‌లో వర్షాలు లేక, మరో వైపు సాత్నాలలో సైతం ఇంకా నీళ్లు రాకపోవడంతో రబీ సాగుపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ స్థాయి 'ఇన్‌స్పైర్‌'కు ఎంపిక



రణుషా

ఆదిలాబాద్‌టౌన్‌: జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌కు ఆదిలాబాద్‌ జిల్లా విద్యార్థి ఎంపికై ంది. 2023–24 విద్యా సంవత్సరంలో ఆన్‌లైన్‌ ద్వారా నిర్వహించిన ఇన్‌స్పైర్‌ రాష్ట్రస్థాయి మేళాలో ఆదిలాబాద్‌ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో ఇంటర్‌ చదువుతున్న రణుషా ప్రతిభ కనబర్చింది. నిర్మల్‌ జిల్లా పోన్కల్‌ గ్రామానికి చెందిన విద్యార్థిని మల్టీపర్పస్‌ అగ్రికల్చర్‌ మిషన్‌ను తయారు చేసింది. తల్లిదండ్రులు లక్ష్మి, రాజారెడ్డి దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రైతులకు సంబంధించిన వివరాలను ప్రాజెక్టు రూపంలో ప్రదర్శించడంతో జాతీయ స్థాయికి ఎంపికైంది. కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు, పాఠశాల యాజమాన్యం అభినందించారు.



తయారు చేసిన మల్టీపర్పస్‌ అగ్రికల్చర్‌ మిషన్‌

ఆందోళన బాటలో 'ఆదర్శ' ఉపాధ్యాయులు



కుంటాలలోని ఆదర్శ పాఠశాల

కుంటాల: ఉమ్మడి జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ నెల 24 నుంచి 29 వరకు ఆందోళనల బాట పట్టనున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం రోజుకో రీతిన నిరసనలు తెలుపనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో 14 ఆదర్శ పాఠశాలలు ఉండగా అందులో సుమారు 160 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

డిమాండ్లు ఇవే..

- బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి.
- 010 పద్దు ద్వారా వేతనం చెల్లించాలి.
- హెల్త్‌ కార్డులు జారీ చేయాలి.
- ఉద్యోగ భద్రత కల్పించాలి.
- కారుణ్య నియామకాలు చేపట్టాలి.

నిరసన కార్యక్రమాలు

- ఈ నెల 24న నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు.
- 25, 26 తేదీల్లో భోజన విరామ సమయంలో నిరసనతో పాటు సీఎంవో విద్యాశాఖ కార్యదర్శికి ట్విట్టర్‌లో పోస్ట్‌ చేయడం.
- 27న తహసీల్దార్‌, మండల విద్యాధికారులకు వినపత్రాలు అందజేత.
- 28న కలెక్టర్‌, జిల్లా విద్యాశాఖాధికారి, 29న పాఠశాల విద్యాశాఖ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆదర్శ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కొన్నేళ్లుగా కోరుతున్నాం. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 24 నుంచి 27వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాం. అయినా స్పందించనిపక్షంలో ధర్నాకు పూనుకుంటాం.

– సందూక్వర్‌ ప్రవీణ్‌ కుమార్‌, మోడల్‌ స్కూల్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఇంటి పైకప్పు కూలి మహిళ మృతి



ఉషాపాండే(ఫైల్‌)

ఆదిలాబాద్‌టౌన్‌: పాత ఇంటి పైకప్పు కూలి ఓ మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బ్రాహ్మణవాడలోని ఓ ఇంట్లో రాంనివాస్‌ పాండే కొంత కాలంగా అద్దెకు ఉంటున్నాడు. పట్టణంలోని అశోక్‌ రోడ్‌ విజయహనుమాన్‌ మందిర్‌లో పూజారిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలింది. ఆ సమయంలో ఇంట్లో రాంనివాస్‌తో పాటు అతని భార్య ఉషా పాండే (50), కూతురు, కుమారుడు ఉన్నారు. వీరు ముగ్గురు వేరే గదిలో ఉండగా, ఉషా పాండే ఉన్న గదిలోని పైకప్పు కూలడంతో ఆమె అందులో చిక్కుకుంది. సిమెంట్‌ పెక్కుల శిథిలాలు ఆమెపై పడ్డాయి. పోలీసులకు, అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని శిథిలాలను తీశారు. రిమ్స్‌ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడి వివాహం డిసెంబర్‌లో నిశ్చయం కావడంతో ఒకట్రెండు రోజుల్లో వేరే అద్దె ఇంట్లోకు వెళ్దామని నిర్ణయించుకున్నారు. ఇంతలోనే ఈ ఘటన జరగడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాంప్లెక్స్‌ వెనకాల గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌ కుమార్‌ తెలిపారు. మృతుని వయస్సు 40 నుంచి 50 సంవత్సరాల మధ్యలో ఉంటుందని, బ్లూ ప్యాంటు, బ్లాక్‌ షర్టు ధరించాడన్నారు. మృతుని ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన మంచిర్యాల శ్రావణ్‌ కుమార్‌ (36) శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం అతని తండ్రి జయప్రకాశ్‌ టూటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ అశోక్‌ తెలిపారు.

విద్యుదాఘాతంతో లేగదూడ మృతి

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో రైతు కూస రాజేశ్వర్‌కు చెందిన లేగదూడ విద్యుదాఘాతంతో మృతి చెందింది. శనివారం మధ్యాహ్నం మేత కోసం వెళ్లిన లేగదూడ మహమ్మద్‌ లతీఫ్‌ పంట చేనులో మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న విద్యుత్‌ తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. లేగదూడ విలువ రూ.65వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. సంఘటన స్థలాన్ని విద్యుత్‌ సిబ్బంది సందర్శించి వివరాలు సేకరించారు.

'టీ–శాట్‌ నిపుణ' కు మస్కాపూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థులు

- ఎన్‌ఎంఎస్‌ఎస్‌ సక్సెస్‌ మీట్‌లో భాగంగా టీ–శాట్‌ ప్రత్యక్ష ప్రసారానికి హాజరు
- హైదరాబాద్‌ టీ–శాట్‌ స్టూడియోలోని లైవ్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



'టీ–శాట్‌ నిపుణ' ప్రత్యక్ష ప్రసారంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఖానాపూర్‌: మండలంలోని మస్కాపూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 19 మంది విద్యార్థులు ఇటీవల ఎన్‌ఎంఎంఎస్‌(నేషనల్‌ మీన్స్‌ కం స్కాలర్‌షిప్‌)రు ఎంపికయ్యారు. 2018 నుంచి ఇప్పటి వరకు పాఠశాల నుంచి 113 మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు అర్హత సాధించడంతో మస్కాపూర్‌ పాఠశాల విద్యార్థులు పలుమార్లు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించారు. 8వ తరగతిలో పరీక్షలు రాసి ఎంపికైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఈ స్కీమ్‌ క్రింద ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల స్కాలర్‌షిప్‌ అందిస్తుంది. దీంతో హైదరాబాద్‌లోని టీ–సాట్‌ నిపుణ ఆధ్వర్యంలో నిర్వహించిన సక్సెస్‌ మీట్‌కు పాఠశాలలోని ఉపాధ్యాయులతోపాటు ఇటీవల ఎంపికైన 19 విద్యార్థులు శనివారం టీ–శాట్‌ ముఖాముఖిలో పాల్గొన్నారు. ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోవడం ఎలా..? పరీక్షకు సన్నద్ధమైన తీరు, పలు అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యక్ష ప్రసారాన్ని మస్కాపూర్‌ గ్రామంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక టీవీలో విద్యార్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు వీక్షించారు. హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి, గైడ్‌ టీచర్‌ జాడి శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు కుర్ర శేఖర్‌, అంజయ్య, కె.శ్రీనివాస్‌, రమేశ్‌ పాల్గొన్నారు.

జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక

ఆదిలాబాద్‌: జాతీయస్థాయి ఆన్‌లైన్‌ చిత్ర పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన చిత్రకారుడు ధ్యావంత్‌ రమేశ్‌ బెస్ట్‌ ఆర్టిస్టు అవార్డుకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన నేషనల్‌ ఆన్‌లైన్‌ ఆర్ట్స్‌ ఎగ్జిబిషన్‌ పోటీల్లో రమేశ్‌కు చెందిన మూడు చిత్రాలు అర్హత సాధించాయి. ఈ చిత్రాలను ఎగ్జిబిషన్లో ప్రదర్శించనున్నట్లు ఆయన తెలిపారు. జాతీయస్థాయిలో అవార్డు సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు

లింక్‌ క్లిక్‌ చేస్తే రూ.4 వేలు మాయం

బోథ్‌: జన్‌దన్‌ పేరిట వచ్చిన లింక్‌ను క్లిక్‌ చేసిన ఓ యువకుడి అకౌంట్‌ నుంచి రూ.4 వేలు మాయమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన ఓ యువ వ్యాపారస్తుడి మొబైల్‌కు జన్‌ధన్‌ యోజన పేరుతో ఒక సందేశం వచ్చింది. లింక్‌ను ఓపెన్‌ చేసి ఈకేవైసీ చేయాలని అందులో ఉంది. దీంతో ఆ యువకుడు లింక్‌పై క్లిక్‌ చేయడంతో మొబైల్‌కు ఓటీపీ వచ్చింది. వెంటనే ఓటీపీని ఎంటర్‌ చేయాలని అడగడంతో ఎంటర్‌ చేశాడు. దీంతో బ్యాంకు అకౌంట్లో ఉన్న రూ.4 వేలు విత్‌డ్రా అయినట్లు అతని మొబైల్‌కు సందేశం వచ్చింది. దీంతో యువకుడు ఖంగుతిన్నాడు.

ఉరేసుకుని ఒకరు బలవన్మరణం

బాసర: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గణేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మండలం కిర్గుల్‌ (కె) గ్రామానికి చెందిన కదం గంగాధర్‌ (45) వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. శనివారం మండల పరిధిలోని కిర్గుల్‌ వెళ్లే దారిలో రొడ్డ మొడ్‌ గుట్ట వద్ద గల వేపచెట్టుకు ఉరేసుకున్నాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని తండ్రి కదం తుకారాం పటేల్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయుల కోసం విద్యార్థుల ఎదురుచూపు



బెల్గాం తండా పాఠశాలలో కూర్చున్న విద్యార్థులు

కుభీర్‌: మండలంలోని బెల్గాం తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు వచ్చి తరగతిగదిలో కూర్చున్నా ఉపాధ్యాయులెవరూ రాలేదు. ఈ పాఠశాలలో 5 తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. అందులో ఒకరు దీర్ఘకాలిక సెలవులో ఉండగా ఉన్న ఒక ఉపాధ్యాయుడు రాజేశ్వర్‌కు ప్రభుత్వం స్కూల్‌ అసిస్టెంట్‌ పదోన్నతి ఇచ్చి కుభీర్‌ ఉన్నత పాఠశాలకు పంపించింది. దీంతో ఇక్కడ ఉపాధ్యాయులు లేరు. మండల విద్యాశాఖ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో శనివారం మధ్యాహ్నం వరకు పాఠశాలకు ఎవరూ రాలేదు. ఈ విషయమై ఎంఈవో చంద్రకాంత్‌ను 'సాక్షి' సంప్రదించగా కాంప్లెక్స్‌ హెచ్‌ఎంను అడగాలన్నారు. కాంప్లెక్స్‌ హెచ్‌ఎం సాయన్నను ఫోన్‌లో సంప్రదించగా నిర్మల్‌ సమావేశంలో ఉన్నానని సమాధానం ఇచ్చారు.

జూడాల నిరసన



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న జూడాలు

ఆదిలాబాద్‌టౌన్‌: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రిమ్స్‌ జూనియర్‌ డాక్టర్లు శనివారం ఆందోళన చేపట్టారు. కళ్లకు గంతలతో ఎమర్జెన్సీ వార్డు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూడాల సంఘం అధ్యక్షుడు సందీప్‌ చారి మాట్లాడుతూ.. జూడాలకు ఇచ్చే స్టైఫండ్‌ ప్రతీనెల 10వ తేదిలోపు అందించాలన్నారు. కొత్తగా ఏర్పడిన మెడికల్‌ కళాశాలల్లో హాస్టల్‌ వసతితో పాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్‌ చేశారు. సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రిలో పీజీ వైద్యులకు ఇదివరకు రూ.1లక్ష 25వేలు వేతనం ఉండగా, ప్రభుత్వం దానిని రూ.95వేలకు కుదించినట్లు తెలిపారు. పాత జీవో ప్రకారమే వేతనం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఇందులో జూడాలు కార్తీక్‌, రాజు యాదవ్‌, సూరజ్‌, బాలమురగ్గన్‌, రష్మి, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి బాసరలో ఆన్‌లైన్‌ సేవలు

- సిబ్బందికి శిక్షణ
- త్వరలో అందుబాటులోకి..



శిక్షణ ఇస్తున్న ఆలయ కార్యనిర్వహణాధికారి

ఆదిలాబాద్‌టౌన్‌: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రిమ్స్‌ జూనియర్‌ డాక్టర్లు శనివారం ఆందోళన చేపట్టారు. కళ్లకు గంతలతో ఎమర్జెన్సీ వార్డు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూడాల సంఘం అధ్యక్షుడు సందీప్‌ చారి మాట్లాడుతూ.. జూడాలకు ఇచ్చే స్టైఫండ్‌ ప్రతీనెల 10వ తేదిలోపు అందించాలన్నారు. కొత్తగా ఏర్పడిన మెడికల్‌ కళాశాలల్లో హాస్టల్‌ వసతితో పాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్‌ చేశారు. సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రిలో పీజీ వైద్యులకు ఇదివరకు రూ.1లక్ష 25వేలు వేతనం ఉండగా, ప్రభుత్వం దానిని రూ.95వేలకు కుదించినట్లు తెలిపారు. పాత జీవో ప్రకారమే వేతనం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఇందులో జూడాలు కార్తీక్‌, రాజు యాదవ్‌, సూరజ్‌, బాలమురగ్గన్‌, రష్మి, జాహ్నవి పాల్గొన్నారు.

ముగిసిన అర్జీయూకేటీ దరఖాస్తు గడువు

బాసర: ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో సమీకృత ఆరేళ్ల ఇంజినీరింగ్‌ విద్యను అభ్యసించడానికి 2024–25 సంవత్సరానికిగాను దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. పీయూసీ మొదటి సంవత్సరంలో 1500 సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను జూలై 3న విడుదల చేయనున్నట్లు వర్సిటీ అధికరులు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన జూలై 8, 9, 10వ తేదీల్లో ఉంటుందని వివరించారు. ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభమవుతాయని ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ తెలిపారు.